సాక్షి
సూర్యాపేట
శుక్రవారం । 30 । మే । 2025



ఉపాధి పనుల్లో విద్యావంతులు
విద్యావంతులతో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు సైతం ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. - 8లో



నలుగురి అరెస్ట్
గంజాయి సాగు చేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. 30 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
35°/24°

వాతావరణం
మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు సూర్యాపేటలో మంత్రి తుమ్మల సమీక్ష

నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ధాన్యం సేకరణ, వ్యవసాయం, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి తదితర అంశాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఈనెల 30న ఉదయం 10 గంటలకు సూర్యాపేట కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కానున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నర్సరీల పరిశీలన


సోమారం గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలోని సోమారం, బురుగులతండా, బొడలదిన్న గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను గురువారం జెడ్పీ సీఈఓ అప్పారావు పరిశీలించారు. నర్సరీల నిర్వహణను గ్రామ పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. నేరేడుచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, సెర్ప్ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బందితో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ సోమ సుందర్ రెడ్డి, ఎంపీఓ నాగేందర్, ఏపీఎం శేఖర్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు రమేష్, స్వరూప, పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు సుజాత, రజిత, శోభన్ తదితరులున్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ శ్రీదేవి

పెన్‌పహాడ్: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని వరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ శ్రీదేవి, కేవీకే శాస్త్రవేత్త సీహెచ్ నరేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో వానాకాలం పంటల సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, డ్రోన్ వినియోగం, వివిధ పంటల్లో చీడపీడల యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, ఏఈఓ కిరణ్, లక్ష్మీనారాయణ, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ నిఖిల్‌రెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సిద్ధం

59లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- సిద్ధంగా ఉన్న 54లక్షల పైచిలుకు మొక్కలు
- పండ్లు, నీడ, పూలు, ఔషధ మొక్కలకు ప్రాధాన్యం
- ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నాటనున్న అధికారులు


కేసారం గ్రామంలోని నర్సరీలో మొక్కలు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : గ్రామాల్లో పచ్చదనం పెంపునకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవాన్ని చేపట్టింది. ఈమేరకు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను సిద్ధం చేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో జూన్‌లో మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో 475 నర్సరీలు

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 59 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం 54లక్షల పైచిలుకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో మొత్తం డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో 475 నర్సరీలు ఉండగా ఈ నర్సరీల్లో మొత్తం 50.02లక్షల మొక్కలు పెంచుతున్నారు. ప్రస్తుతం 40.472 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. 10 లక్షల మొక్కలు విత్తు దశలో ఉన్నాయి. ఈ ఏడాది డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో 28.87 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా మిగిలిన మొక్కలను వన మహోత్సవంలో భాగస్వాములుగా ఉన్న మరో 18 శాఖలకు మొక్కలు అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 5 నర్సరీలు ఏర్పాటు చేసి 2.439 లక్షల మొక్కలు పెంచి నాటేందుకు సిద్ధంగా ఉంచారు. జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లో 1.93 లక్షల మొక్కలు పెంచి నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తంగా 54,39100 మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు.

నెలరోజుల్లో టార్గెట్ పూర్తిచేస్తాం

నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నాటడం ప్రారంభిస్తాం. నాటిన మొక్కలు సంరక్షించడానికి ట్రీ గార్డులు, వాచర్‌లను సిద్ధం చేశాం. అధికారుల ద్వారా ఖాళీ ప్రదేశాలను గుర్తించాం. గుంతలు తీయించి నెలరోజుల్లో ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిచేస్తాం.
– సతీష్, జిల్లా అటవీ శాఖ అధికారి

మొక్కల సంరక్షణ బాధ్యత

ఈ సారి ఎక్కువగా పండ్లు, నీడ, పూలు, ఔషధ మొక్కలను పెంచుతున్నారు. ప్రభుత్వ భూముల్లో ఇతర ప్రదేశాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నాటిన మొక్కల సంరక్షణ ఉపాధిహామీ కూలీలు చూడనున్నారు. మున్సిపాలిటీల్లో మొక్కల సంరక్షణ బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించారు. అత్యధికంగా డీఆర్‌డీఓ 28.870 లక్షల మొక్కలు, తర్వాత స్థానంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ 15.53 లక్షల మొక్కలు, అత్యల్పంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 4.5 వేల మొక్కలు నాటనున్నారు.

ఆయా శాఖల వారీగా నాటాల్సిన మొక్కల వివరాలు

అటవీ శాఖ	4,32,000
డీఆర్‌డీఏ	28,87,000
విద్యా శాఖ	45,000
రోడ్లు భవనాలు	50,000
నీటి పారుదల	2,57,000
వ్యవసాయ శాఖ	383,000
రెవెన్యూ	1,00,000
ఆబ్కారీ	94,900
మున్సిపల్ పరిపాలన, పట్టణ అభివృద్ధి	15,53,000
వైద్య ఆరోగ్య	22,500
హోం శాఖ	47,600
పరిశ్రమలు	60,000
హార్టికల్చర్	38,300
సాంఘిక సంక్షేమ	7500
గిరిజన	10,000
బీసీ సంక్షేమ	4500
మైనార్టీ సంక్షేమ	7500
పశు సంవర్ధక శాఖ	7500

జిల్లా వ్యవసాయాధికారితో 31న ఫోన్ ఇన్

ఈసారి వర్షాలు ముందుగానే కురుస్తున్నందున ఆరుద్ర కార్తె కంటే ముందే పంటల సాగుకు సన్నద్ధం కావచ్చా.. పత్తి తదితర మెట్టపంటలు ఎప్పుడు వేసుకుంటే బాగుంటుంది. వానాకాలం వరినార్లు పోసుకునేందుకు అనువైన సమయం ఎప్పుడు.. విత్తనాల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి.. నకిలీ విత్తనాలను ఎలా గుర్తుపట్టాలి.. తదితర సమాచారం రైతులు తెలుసుకునేందుకు జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. రైతన్నలు నేరుగా వ్యవసాయాధికారికి ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

తేది. 31.05.2025 (శనివారం)
సమయం : ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

డయల్ చేయాల్సిన ఫోన్ నంబర్ :
89777 55833

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

- కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ధర్నా

భానుపురి (సూర్యాపేట) : ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ నిధుల్లో కోత విధించిందన్నారు. రాష్ట్రానికి 15కోట్ల పని దినాలు అవసరం ఉంటే ఇవ్వకపోగా గతంలో ఉన్న 8కోట్ల పనిదినాలను 6.5 కోట్లకు తగ్గించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫొటో అప్‌లోడ్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మంచినీళ్లు, మెడికల్ కిట్లు, టెంటు, పనిముట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మహిళా కూలీల జిల్లా కన్వీనర్ జంపాల స్వరాజ్యం, సోమపంగా జానయ్య, నల్ల మేకల అంజయ్య, షేక్ సైదా హుస్సేన్, మిట్టపల్లి లక్ష్మీ, రామకృష్ణారెడ్డి, గుంజ వెంకటేశ్వర్లు, శేఖర్, వల్లపుదాసు సాయికుమార్, జహంగీర్, వెంకన్న, ధనుంజయ్ గౌడ్ శ్రీనివాస్, సైదులు, మేరెడ్డి కృష్ణారెడ్డి, సుందరయ్య, శిగా శ్రీనివాస్, బోడపట్ల హుస్సేన్, వీరబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు వర్షాలతో కృష్ణానదికి వరద

- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు


సాగర్ జలాశయం

నాగార్జునసాగర్: ముందస్తుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి వరదలు ప్రారంభమయ్యాయి. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాజెక్టులలోకి ఒక మోస్తారుగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువన ప్రాజెక్టులన్నీ ఖాళీగా ఉన్నప్పటికీ.. మూడు నెలల ముందుగా మే నెలలోనే వరదలు మొదలవడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జూరాల ప్రాజెక్టు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టుకు అధికంగా వరద వచ్చింది. ఎగువ నుంచి 82 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో 12 గేట్లు రెండు మీటర్ల ఎత్తు ఎత్తి అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరదలు మొదలైతే గత ఏడాది కన్నా ముందుగానే ప్రాజెక్టులు నిండే అవకాశాలు ఉంటాయని సాగునీటి శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 512.50 అడుగులుగా కాగా 135.9545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గరిష్ట నీటి మట్టం 590 అడుగులు(312.0450 టీఎంసీలు).

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

- ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : ప్రజల రక్షణ, భద్రత కోసం జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు ఎస్పీ నరసింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రయాణ సమయంలో వాహనదారులు రహదారి భద్రత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా గమ్యాన్ని చేరొచ్చని పేర్కొన్నారు. గత ఐదు నెలల్లో నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న 1,25,000 వాహనాలపై జరిమానా విధించామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 6500 మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేటటౌన్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు)లో 220 మంది విద్యార్థులు, కోదాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో 220 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. జూన్ 3న మొదటి లాంగ్వేజ్ (తెలుగు), 4న రెండవ లాంగ్వేజ్ (హిందీ), 5న ఇంగ్లిష్, 6న గణితం, 9న ఫిజికల్ సైన్స్, 10న బయోలాజికల్ సైన్స్, 11న సోషల్ స్టడీస్‌తో పాటు 12, 13 తేదీల్లో ఒకేషనల్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాలకు దగ్గరలో ఉన్న జీరాక్స్ సెంటర్లను మూసివేయించాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షలకు హాజరై మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కోదాడ: సీపీఐ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం కోదాడలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కోదాడ మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహించడంతో పాటు పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. త్వరలో సూర్యాపేటలో జరగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మేకల శ్రీనివాసరావు, బద్దం కృష్ణారెడ్డి, బొల్లు ప్రసాద్, బత్తినేని హనుమంతరావు, ఎస్‌కే. లతీఫ్, సత్యనారాయణ, ప్రసాద్, నగేష్ పాల్గొన్నారు.

అనర్హుల ఏరివేత!

- రేషన్ బియ్యం తీసుకోని కార్డుదారులపై దృష్టి
- ఇప్పటివరకు 1,818 మంది గుర్తింపు
- విచారణ అనంతరం కార్డులు తొలగించాలా? వద్దా? అన్నది తేల్చనున్న అధికారులు




నాగారం : రేషన్ బియ్యం అర్హులకే అందేలా ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. గడిచిన ఆరునెలలుగా బియ్యం తీసుకోని కార్డుదారుల వివరాలను గుర్తించిన ప్రభుత్వం.. ఆ జాబితాను జిల్లాలకు చేరవేసింది. ఇంతకీ ఆ కార్డు దారులు ఉన్నారా? లేదా? అన్నది తేల్చేందుకు క్షేత్రస్థాయిలో విచారణకు ఆదేశించింది. దీంతో పౌర సరఫరాల అధికారులు జిల్లాలో అనర్హులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ఒకవైపు ప్రభుత్వం అర్హులకు కొత్త కార్డులను ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా.. మరోవైపు ఉన్నకార్డుల్లో కొందరు అనర్హులుగా ఉన్నట్లుగా గుర్తించింది. అందుబాటులోకి వచ్చిన సాంకేతికతతో ఒకే ఆధార్ నంబర్ కలిగిన లబ్ధిదారులు రెండు చోట్ల సరకులు తీసుకుంటున్నట్లుగా తేల్చారు. అదేవిధంగా ఆరు నెలలుగా బియ్యం తీసుకోని వారి వివరాలను సేకరించింది. ఇందులో వంద ఏళ్ల దాటిన వారు, 18 ఏళ్లలోపు ఉన్నవారితో పాటు చనిపోయినవారు ఉన్నారు. క్షేత్రస్థాయి విచారణను బట్టి కార్డులను తొలగించాలా? వద్దా అన్నది తేల్చనున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 610 రేషన్ దుకాణాలు ఉండగా వాటి పరిధిలో 3.24లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతినెలా 6,000 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. అయితే గడిచిన ఆరునెలలుగా బియ్యం తీసుకోని కార్డుదారుల వివరాల సేకరణలో భాగంగా జిల్లాలో అధికారులు ఇప్పటి వరకు 1818 మంది కార్డుదారులను గుర్తించారు. వీరు బియ్యం కోసం రేషన్ దుకాణాలకు రావడం లేదంటే వారు అర్హులా? కాదా? అన్న అనుమానాలు లేకపోలేదు.

నిర్ధారించుకున్నాకే కార్డు రద్దుకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అనర్హులను గుర్తించేందుకు క్షేత్రస్థాయి విచారణ చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా 3.24 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో రేషన్ బియ్యం తీసుకోని 1818 మంది కార్డుదారులను గుర్తించాం. అనుమానితుల జాబితాను క్షేత్రస్థాయిలో విచారించి రెండు చోట్ల బియ్యం తీసుకుంటే అలాంటి వారిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. చనిపోయిన వారి సమాచారం నిర్ధారించుకున్నాకే ఆ కార్డుల రద్దునకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అర్హులకు రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటాం.
– మోదుగు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ డీఎస్‌ఓ, సూర్యాపేట

చిన్నారులకు వరం.. బాలభవన్

- లలిత కళలపై వేసవిలో ఉచిత శిక్షణ
- శిక్షణ పొందుతున్న 670 మంది విద్యార్థులు


జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని బాలభవన్‌లో డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

సూర్యాపేట : లలిత కళలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని బాల భవన్ ఓ వరంగా మారింది. డ్యాన్స్, పేరిణి నృత్యం, ఆర్ట్, క్రాఫ్ట్, తబలా, మ్యూజిక్, కోలాటం, డ్రాయింగ్ ఇలా అనేక అంశాలపై విద్యార్థులకు నచ్చిన కళలపై వేసవి సెలవుల్లో తర్ఫీదు ఇస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న బాల భవన్‌ను వసతుల దృష్ట్యా ఈ ఏడాది జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోకి మార్చారు. అక్కడే శిక్షణ ఇస్తున్నారు. జూన్ 11 వ తేదీ వరకు ఈ శిక్షణ కొనసాగనుంది.

శిక్షణకు మొత్తం 670 అడ్మిషన్లు

ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శిక్షణ నిర్వహిస్తుండటంతో చిన్నారులతో పాఠశాల ఆవరణ కోలాహలంగా ఉంది. ఈ శిక్షణకు మొత్తం 670 విద్యార్థులు అడ్మిషన్లు రాగా ప్రస్తుతం 350 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

డ్యాన్స్ నేర్చుకుంటున్నా



నేను బాలభవన్‌లో నాలుగేళ్లుగా డ్యాన్స్ నేర్చుకుంటున్నాను. వేసవి సెలవుల్లో ప్రతి రోజు తప్పకుండా శిక్షణకు హాజరవుతాను. నాకు గత ఉగాది పురస్కారాల్లో నంది అవార్డు, కళా ఉత్సవంలో స్టేట్ లెవల్ ద్వితీయ బహుమతి వచ్చింది. ఇక్కడ మాస్టర్లు డ్యాన్స్ బాగా నేర్పిస్తున్నారు.
– వర్ష, విద్యార్థిని


క్రాఫ్ట్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

క్రాఫ్ట్‌లో శిక్షణ పొందుతున్నా



క్రాఫ్ట్‌లో శిక్షణ పొందుతున్నా. కాగితంతో ఫ్లవర్స్, రోజ్ ఫ్లవర్స్, హ్యాండ్ వర్క్, వేస్ట్ బాటిల్‌తో క్రాఫ్ట్ డిజైన్‌లు ఎలా కట్ చేసి చేయాలో నేర్చుకుంటున్నా. ప్రతి రోజు ఇక్కడకు వచ్చి నేర్చుకోవడం ఆనందంగా ఉంది.
– అభినవ సాగర్, విద్యార్థి

మృదంగం నేర్చుకుంటున్నా



నేను ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నా. వేసవి సెలవుల్లో మూడేళ్లుగా బాలభవన్‌లో మృదంగంపై శిక్షణ పొందుతున్నా. ప్రతి రోజు గంట పాటు మృదంగంలో మెళకువలు నేర్పిస్తున్నారు. చాలా ఇష్టంగా నేర్చుకుంటున్నా.
– కె.సంతోష్ విద్యార్థి

విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది

విద్యార్థులు పొందుతున్న శిక్షణ వారికి భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతిభ చాటడానికి లలిత కళలు తోడ్పడుతాయి. జ్ఞాపక శక్తి సామర్థ్యం పెరుగుతుంది. పై చదువులు అభ్యసించే సమయంలో అదనపు స్కిల్స్ కలిగిన వారికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ప్రస్తుతం బాలభవన్‌లో సమస్యల దృష్ట్యా జెడ్పీ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్నాం. బాలభవన్‌కు సొంత భవనం నిర్మిస్తే మరింత ప్రయోజనంగా ఉంటుంది.
– బండి రాధాకృష్ణారెడ్డి, బాలభవన్ సూపరింటెండెంట్

పాఠశాలల ప్రారంభానికి ముందే యూనిఫాం అందించాలి


యూనిఫామ్ పరిశీలిస్తున్న డీఈఓ

నాగారం : పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థుల స్కూల్ యూనిఫాం కుట్టడం పూర్తిచేసి అందించాలని డీఈఓ అశోక్ సూచించారు. గురువారం నాగారం మండల కేంద్రంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్టిచ్చింగ్ చేస్తున్న స్కూల్ యూనిఫామ్స్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది కంటే ఎక్కువ మంది విద్యార్థులు నమోదయ్యేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో బడిబాట నిర్వహించి బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ మారయ్య, ఎంఈఓ వాసం ప్రభాకర్, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


నాగులు (ఫైల్)

మేళ్లచెరువు: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన గురువారం మేళ్లచెరువు మండల పరిధిలోని కందిబండ గ్రామ సమీపంలో జరిగింది. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన నాగులు(45) పని నిమిత్తం బైక్‌పై గురువారం మేళ్లచెరువుకు వస్తుండగా.. కందిబండ సమీపంలో గుర్తుతెలియని వాహనం అతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగులును స్థానికులు 108 వాహనంలో కోదాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రహీనాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో..


అనిత (ఫైల్)

రామన్నపేట: ఇంట్లో సంపు మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మహిళ మృతిచెందింది. ఈ ఘటన గురువారం రామన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన అనిత(33)కు రామన్నపేటకు చెందిన జూకంటి మహేష్‌తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. మహేష్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అనిత గురువారం ఉదయం ఇంట్లో నీటి సంపు మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మృతురాలి భర్త మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడలోని పశువుల సంత నుంచి కొనుగోలు చేసిన ఐదు గోవులు, ఆరు ఎద్దులను ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. కోదాడకు చెందిన వాహన డ్రైవర్ షేక్ అఫీమ్, కొండ వీరకృష్ణ, కుంబజాడ సాయిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. పట్టుబడిన గోవులు, ఎద్దులను గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

మునగాలలో..

మునగాల: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని గురువారం ఉదయం విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. కోదాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనంలో రెండు ఎద్దులు, ఆరు ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించామన్నారు. కోదాడ పట్టణానికి చెందిన షేక్ ఖాజామోయినుద్దీన్, వాహన డ్రైవర్ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పనుల్లో విద్యావంతులు

పలువురు మాజీ ప్రజాప్రతినిధులు సైతం కరువు పనికి..

డిగ్రీలు, పీజీలు చేసిన విద్యావంతులతో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు సైతం ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూ ఖాళీ సమయాల్లో, మరికొందరు ఉన్నత ఉద్యోగాలు రాక పలుగు, పార పట్టుకుంటున్నారు. మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీపీలు సైతం లాభాపేక్ష లేకుండా రాజకీయాలు చేసి ఇప్పుడు కుటుంబ పోషణ కోసం ఉపాధి కూలీలుగా మారారు.

చదువుల ఖర్చు కోసం..


మచ్చ వాణి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహడ్ గ్రామానికి చెందిన మచ్చ వాణి డీఎంఎల్‌టీ నర్సింగ్ పూర్తి చేసింది. ప్రస్తుతం గ్రామంలో జరిగే ఉపాధి పనులకు ప్రతిరోజు వెళ్తోంది. చదువుల ఖర్చు వెళ్లదీసుకోవడానికి ఉపాధి పనులకు వెళుతున్నట్లు ఆమె పేర్కొంది. ఖాళీ సమయాల్లో ఉపాధి పనులకు వెళ్లి ఆ తర్వాత చదువుకుంటున్నట్లు ఆమె చెప్పారు.

పీజీ ఎగ్జామ్‌కు సన్నద్ధమవుతూ..


తండు సైదులు

తిప్పర్తి: తిప్పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని నూకలవారిగూడేనికి చెందిన తండు సైదులు డిగ్రీ పూర్తిచేసి గ్రూప్స్‌కు పరీక్షలు రాశాడు. పీజీ చేసేందుకు సన్నద్ధమవుతూ ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాడు. ఈ సీజన్‌లో వారం పాటు పనులకు వెళ్లాడు. గత సీజన్ మొత్తం ఉపాధి హామీ పనులు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తూనే..


మట్టిపల్లి సతీష్

అర్వపల్లి: ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూనే వేసవి సెలవుల్లో ప్రతిరోజు ఉపాధి పనికి వెళ్తున్నారు జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహడ్ గ్రామానికి చెందిన మట్టిపల్లి సతీష్, ఎంఎస్సీ పూర్తిచేశారు. ఉదయం వేళ ఉపాధి పనికి వెళ్లి ఆ తర్వాత ఇతర పనులు చేసుకుంటానని సతీష్ పేర్కొన్నారు.

ఉద్యోగం రాక..


చేడె వెంకన్న

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లికి చెందిన చేడె వెంకన్న పీజీ(బీఏ లిటరేచర్) చేశారు. ఉద్యోగం కోసం ప్రయత్నించగా రాకపోవడంతో సొంత పనులతో పాటు ప్రతిరోజు ఉపాధి పనికి వెళ్తున్నారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగం రాలేదని బాధపడాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

పీజీ చదువుకొని..


మండల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లికి చెందిన మండల్‌రెడ్డి రవీందర్ రెడ్డి పీజీ పూర్తిచేశారు. ఉద్యోగం కోసం ప్రయత్నించగా రాకపోవడంతో వ్యవసాయంతో పాటు ఖాళీ సమయాల్లో ఉపాధి పనికి వెళ్తున్నారు. ఈ పనికి వచ్చే డబ్బులతో ఇంట్లో ఖర్చులు వెళ్లదీస్తున్నట్లు ఆయన తెలిపారు.

బీఈడీ పూర్తిచేసి..


ఆరె విజయ్

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లికి చెందిన ఆరె విజయ్ బీఈడీ చేశారు. ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తూనే ఉపాధి పనికి వెళ్తున్నారు. ఉపాధి పనులు చేయడం ద్వారా వచ్చే డబ్బులతో కుటుంబం గడుస్తోందని ఆయన చెప్పారు.

నాడు ఎంపీపీ.. నేడు ఉపాధి కూలీ


యాతాకుల పున్నమ్మ

ఆత్మకూరు(ఎస్): మండల కేంద్రానికి చెందిన యాతాకుల పున్నమ్మ 2006 నుంచి 2011 వరకు ఎంపీపీగా పనిచేశారు. పదవిలో ఉన్నన్ని రోజులు ఆమె ఎలాంటి లాభాపేక్ష లేకుండా మండల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాటుపడింది. నేడు గ్రామంలో ఉపాధి పనులకు వెళ్తూ సాధారణ మహిళగా కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం గడుపుతోంది.

సర్పంచ్‌గా చేసి..


మాదగాని నాగమ్మ

అర్వపల్లి: 2014 నుంచి 2018 వరకు జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహడ్ గ్రామానికి చెందిన మాదగాని నాగమ్మ సర్పంచ్‌గా పనిచేసింది. సర్పంచ్ పదవీకాలం పూర్తయినప్పటి నుంచి కుటుంబ పోషణ కోసం గ్రామంలో ఉపాధి హామీ పనికి వెళ్తోంది. తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, ఉపాధి పనికి వెళ్లి కుటుంబం వెళ్లదీస్తున్నట్లు నాగమ్మ పేర్కొంది.

• పూల చెట్టు.. కిరాణ కొట్టు



భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన చిలువేరు లలిత కిరాణ కొట్టుపై విరబూసిన పూల చెట్టు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కిరాణం కొట్టుపై అలంకరించినట్లు ఎరుపు రంగు కాగితం పూలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. – భూదాన్‌పోచంపల్లి

గంజాయి సాగుచేస్తున్న నలుగురి అరెస్ట్

- 30 గంజాయి మొక్కలు, బైక్, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మౌనిక

పెద్దఅడిశర్లపల్లి: గంజాయి సాగుచేస్తున్న నలుగురు వ్యక్తులను గుడిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో దేవరకొండ ఏఎస్పీ మౌనిక విలేకరులకు వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మట్టూరు గ్రామానికి చెందిన దెరగుంల సింగరావు కొండమల్లేపల్లిలో పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల గ్రామ శివారులో గల నాగిళ్ల పాండరయ్య వ్యవసాయ భూమిని పిల్లిగుంటతండాకు చెందిన ఇస్లావత్ చందూతో కలిసి సింగరావు కౌలుకు తీసుకున్నారు. పండ్ల వ్యాపారంలో భాగంగా సింగరావుకు నాంపల్లి మండలం బండతిమ్మాపురం గ్రామానికి చెందిన కొత్తగొల్ల శ్రీను పరిచయమయ్యాడు. సింగరావుకు శ్రీను కొన్ని గంజాయి విత్తనాలు ఇచ్చి వాటి మొక్కలుగా పెంచి ఇస్తే డబ్బులు ఇస్తానని చెప్పడంతో కౌలుకు తీసుకున్న భూమిలో సింగరావు గంజాయి విత్తనాలు నాటాడు. అవి మొక్కలుగా పెరిగిన తర్వాత శ్రీనుకు ఇచ్చాడు. శ్రీను రూ.5 వేలు సింగరావుకు ఇవ్వగా అందులో నుంచి రూ.2 వేలు చందూకు ఇచ్చాడు. శ్రీనుతో పాటు రేవల్లి గ్రామానికి చెందిన వంగూరి శివ కలిసి గంజాయి మొక్కలను అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఇదే క్రమంలో శ్రీను తిరిగి సింగరావుకు 30 గంజాయి విత్తనాలు ఇవ్వగా చందూతో కలిసి కౌలుకు తీసుకున్న భూమిలో నాటారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తన సిబ్బందితో కలిసి సింగరావు కౌలుకు తీసుకున్న వ్యవసాయ భూమిపై దాడి చేసి 30 గంజాయి మొక్కలు, బైక్, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. సింగరావుతో పాటు చందూ, శ్రీను, శివను అరెస్ట్ చేశారు. నిందితులను పట్టుకున్న కొండమల్లేపల్లి ఇన్‌చార్జి సీఐ రాజు, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, కొండమల్లేపల్లి ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది గురువారెడ్డి, హట్టి, ఏడుకొండల్, రామకృష్ణ, శివ, మౌనిక, రవి, యాదగిరి, లింగయ్య, ఆనంద్‌ను ఏఎస్పీ అభినందించారు.

పెట్రోల్ బంకుల్లో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- రూ.2లక్షల నగదు, బైక్, 6 ఏటీఎం కార్డులు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: పెట్రోల్ బంకులను టార్గెట్‌గా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని నాగార్జునసాగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం రావిపాడు గ్రామానికి చెందిన అనాల శివ పెట్రోల్ బంకుల్లోకి వెళ్లి, తన బంధువులు ఆస్పత్రిలో ఉన్నారని.. డబ్బులు అవసరం ఉన్నాయని చెప్పి తన ఏటీఎం కార్డుతో స్వైపింగ్ మిషన్ ద్వారా పెట్రోల్ బంకు అకౌంట్‌కు డబ్బులు పంపి నగదును తీసుకునేవాడు. ఈ తర్వాత స్వైపింగ్ కార్డు ద్వారా వైడ్ అనే ఆప్షన్‌తో తాను పంపిన డబ్బులను తిరిగి తన అకౌంట్‌కే పంపించుకునేవాడు. ఈ విధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలా జిల్లాల్లో మోసాలకు పాల్పడ్డాడు. ఈ నెల 16వ తేదీన నాగార్జునసాగర్‌లో హైవే పక్కన ఉన్న భారత్ పెట్రోల్ బంక్‌కు వెళ్లి తనకు డబ్బులు అవసరం ఉన్నాయని స్వైపింగ్ చేసి డబ్బులు తీసుకుని తిరిగి స్వైపింగ్ ద్వారా వైడ్ అనే ఆప్షన్‌తో తన అకౌంట్‌కు డబ్బులు పంపించుకున్నాడు. ఈ మోసాన్ని గుర్తించిన బంకు యజమాని బొమ్మిడి బ్రహ్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీఐ బి. శ్రీనునాయక్ గురువారం నాగార్జునసాగర్ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన అనాల శివ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా అతడిని పోలీసులు వెంబడించి పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. నిందుతుడి నుంచి రూ.2లక్షల నగదు, బైక్,, 6 ఏటీఎం కార్డులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో నాగార్జునసాగర్ సీఐ బి. శ్రీనునాయక్, ఎస్ఐ ఎస్. సంపత్, కానిస్టేబుళ్లు రామకోటి, జావేద్, సురేష్, సతీష్, వెంకన్న, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శిశువుల విక్రయం కేసు దర్యాప్తు ముమ్మరం

- మరింత లోతుగా విచారణ చేస్తున్న పోలీసులు
- ఇప్పటికే 13 మంది నిందితుల రిమాండ్
- ముఠా మూలాలు పలు రాష్ట్రాల్లో ఉన్నట్లు ప్రాథమిక సమాచారం

సూర్యాపేటటౌన్: శిశువుల విక్రయం కేసును పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సూర్యాపేటకు చెందిన దంపతులు ముఠాతో చేతులు కలిపి.. ఇతర రాష్ట్రాల నుంచి చిన్నారులను తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. ఈ ముఠాకు సంబంధించిన అసలు మూలాలు అహ్మదాబాద్, ముంబైలో ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అసలు ఈ ముఠాలో ఇంకెంత మంది ఉన్నారనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. పోలీసులు గురువారం సూర్యాపేటలో 13 మంది సభ్యులు గల శిశువుల విక్రయ ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 10 మంది చిన్నారులను విక్రయించినట్లు విచారణలో ఒప్పుకోగా.. ఆ పది మంది పిల్లలను తీసుకొచ్చి నల్లగొండ శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. వీరు రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది పిల్లలను అమ్మినట్టు పోలీసుల విచారణలో తేలగా 10 మంది పిల్లలను తీసుకురాగా మరో 18మంది ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కోర్టులో హాజరు పరిచిన నిందితులను త్వరలో కస్టడీకి తీసుకొని విచారించనున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

ఎక్కడ నుంచి తీసుకొచ్చారు?

ఈ ముఠాలోని ఇద్దరు సూర్యాపేట వారు కాగా.. మిగతా 11మంది హైదరాబాద్, విజయవాడ, రాజస్థాన్‌కు చెందిన వారిగా గుర్తించారు. అహ్మదాబాద్, ముంబై నుంచి పిల్లలను తీసుకొచ్చి రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు విక్రయిస్తున్నట్టు నిందితులు ఒప్పుకున్నారు. వీరు పిల్లలను ఎక్కడ నుంచి తీసుకొస్తున్నారు.. ఆర్థిక స్థోమత లేని దంపతులకు డబ్బు ఆశ చూపి కొనుగోలు చేస్తున్నారా అనే విషయాన్ని కూడా సూర్యాపేట సీసీఎస్ పోలీసులు ఆరాతీస్తున్నారు.

నిందితులపై గతంలోనూ శిశు విక్రయ కేసులు

శిశు విక్రయ కేసులో పట్టుబడిన నిందితులపై గతంలోనూ శిశు విక్రయ కేసులు నమోదై ఉన్నాయి. ఏ6గా ఉన్న విజయవాడలోని గొల్లపూడికి చెందిన గరికముక్కు విజయలక్ష్మిపై గతంలో సూర్యాపేట జిల్లా మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు, జనగామ జిల్లాలో ఒక కేసు, ఏలూరు వన్‌టౌన్‌లో ఒక కేసు, మంగళగిరిలో ఒకటి ఉంది. అలాగే ఏ8గా ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ముడావత్ రాజుపై మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, ముంబైలో మరో కేసు నమోదై ఉంది. ఏ9గా ఉన్న హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఐత శోభారాణిపై మేడిపల్లిలో ఒకటి, ముంబైలో ఒక కేసు నమోదై ఉంది. ఏ10గా ఉన్న రాజస్థాన్ రాష్ట్రం సోలంబర్‌కు చెందిన ఖాన్ షాహీనాపై ముంబైలో ఒక కేసు ఉంది. ఏ11గా ఉన్న తిరుమలగిరికి చెందిన ఎం డి.షాహనాపై ముంబైలో ఒక కేసు ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సుధాకర్ (ఫైల్)

మాడ్గులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామానికి చెందిన బొప్పని సుధాకర్(42) హైదరాబాద్‌లో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం తోపుచర్ల నుంచి కుక్కడం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. కుక్కడం గ్రామ శివారులో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను స్థానికులు మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఈ నెల 19న హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


మహేందర్ (ఫైల్)

మాడ్గులపల్లి, నల్లగొండ: ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తితో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం కొత్తగూడెం గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం సిలార్‌మియాగూడేనికి చెందిన రాయి మహేందర్ (21) ప్రైవేట్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెందిన మహేందర్ గురువారం కొత్తగూడెం గ్రామ శివారులో గుంటూరు నుంచి వికారాబాద్ వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి వెంటనే రైల్వే సిబ్బందికి సమాచారం అందించగా.. రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మహేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్ఐ బి. రామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో నుంచి జారిపడి..

నల్లగొండ: నల్లగొండ–శ్రీరాంపురం రైల్వే స్టేషన్ల మధ్యన సుమారు 45ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి గురువారం రైలు నుంచి జారిపడి మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ బి. రామకృష్ణ తెలిపారు. మృతుడు తెలుపు రంగు టీషర్టు, నీలం రంగు బనియన్, నలుపు రంగు నిక్కర్ ధరించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712658595 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి


ఘటనా స్థలంలో బాషి మృతదేహం

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండ గ్రామానికి చెందిన బూతం బాషి(30) గురువారం వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాషి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెన్నకేశ్వరస్వామి దేవాలయంలో చోరీ


ఆలయంలో విచారణ జరుపుతున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో గల చెన్నకేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గుండ్ల రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చెన్నకేశ్వరస్వామి ఆలయం గేటుకు వేసిన తాళంతో పాటు గర్భగుడి తాళాలను పగులగొట్టి లోనికి వెళ్లి హుండీలోని నగదుకు ఎత్తుకెళ్లారు. హుండీని ఆలయ సమీపంలోని ఓ రైతు పొలంలో పడేశారు. గురువారం ఉదయం కారింగు బాలయ్య గుడిని శుభ్రం చేసేందుకు వెళ్లగా.. ఆలయం గేటుకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఇన్‌చార్జి ఎస్ఐ జగన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. హుండీలో సుమారు రూ.50వేల నగదు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇదే దేవాలయంలో గతంలో కూడా దొంగలు చోరీకి పాల్పడి అమ్మవారి మెడలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

గొర్రెలకు పొంచి ఉన్న చిటుకు వ్యాధి ముప్పు

- ముందస్తుగానే ఎంట్రో టాక్సీనియా టీకా వేయించాలి
- త్రిపురారం మండల పశువైద్యాధికారి నాగేందర్ సూచన



పాడిపంట

త్రిపురారం: గొర్రెలకు సోకే వ్యాధుల్లో చిటుకు వ్యాధి అత్యంత ప్రమాదకరమైంది. ఈ వ్యాధిని నెత్తి పిడుగు, గడ్డి రోగం, పాటు రోగం వంటి పేర్లతో పిలుస్తుంటారు. గొర్రెలు తొలకరి వర్షాలకు మొలిచిన గడ్డిని ఎక్కువగా తినడం వల్ల చిటుకు వ్యాధి సోకుతుంది. బలిష్టంగా పెరిగి యుక్త వయసులో ఉన్న గొర్రెలు ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మేత కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే గొర్రెల్లో ఈ వ్యాధి లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధి నివారణకు గొర్రెల పెంపకందారులు సకాలంలో జాగ్రత్తలు పాటిస్తే నష్టాన్ని తగ్గించుకోవచ్చని త్రిపురారం మండల పశువైద్యాధికారి నాగేందర్ సూచిస్తున్నారు.

తొలకరిలో లేత గడ్డి తినడం వలన..

తొలకరి వర్షాలకు పొలాలు, గట్లపై పెరిగిన లేత గడ్డిని గొర్రెలు ఇష్టంగా తింటాయి. తద్వారా క్లాస్ట్రీడియం ఫర్ ఫ్రిజ్జర్స్ టైప్-డీ రకం సూక్ష్మజీవులు జీవాల పేగుల్లో గాలి లేని వాతావరణంలో అభివృద్ధి చెందుతాయి. ఈ సూక్ష్మజీవులు వదిలిన విష పదార్థాలు చిటుకు వ్యాధికి కారణమవుతాయి. మే నెల ఆఖరు నుంచి జూలై నెల మధ్యలో ఈ వ్యాధి ఎక్కువగా గొర్రెలకు సోకుతుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు ఎగిరి కిందపడి కాళ్లు గిలగిల కొట్టుకుంటూ, పళ్లు కొరుకుతూ బిగుసుపోయి ప్రాణాలు కోల్పోతాయి. వ్యాధి సోకిన జీవాలు మేత మేకపోవడం, నెమరు వేయకపోవడం, తలలు వాల్చి ముడుచుకొని ఒకే చోట నిలబడతాయి. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశు వైద్యులను సంప్రదించి సకాలంలో చికిత్స చేయించాలి.

నివారణ మార్గాలు

జీవాలకు ప్రతి యేటా ఏప్రిల్, మే నెల మధ్యలో వ్యాధి నిరోధక టీకా (మల్టీకాంపోనెంట్ ఈటీ వ్యాక్సిన్) తప్పనిసరిగా వేయించాలి. రెండో విడత అక్టోబర్, నవంబర్ నెలల్లో వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. తొలకరి వర్షాలకు మొలిచిన, వాడిపోయిన గడ్డిని జీవాలు మేయకుండా జాగ్రత్తలు పాటించాలి. గొర్రెలను ఉదయం కొంచెం ఆలస్యంగా మేతకు తీసుకెళ్లాలి. మధ్యాహ్నం చెట్ల కింద కాస్త విశ్రాంతి తీసుకునే విధంగా చూడాలి. సాయంత్రం ఎక్కువ సేపు పొలంలో ఉండకుండా దొడ్లలోకి తీసుకెళ్లాలి. వ్యాధి సోకిన గొర్రెలను మందలకు దూరంగా ఉంచాలి. ఇలాంటి జాగ్రత్తలతో చిటుకు వ్యాధి సోకకుండా చూసుకోవడంతో పాటు వ్యాధి బారిన పడిన జీవాలను కాపాడుకోవచ్చు.